ఈనాటికీ దర్జాగానే..

- రెడీమేడ్ అందుబాటులో ఉన్న తగ్గని పని
- జగనన్న చేదోడుతో పూర్వ వైభవం
- నేడు టైలర్స్ డే

పిఠాపురం: ఒకప్పుడు సూదీ దారంతో ప్రారంభమైన కుట్టు ఇప్పుడు కొత్త కొత్త మెషీన్లతో కావల్సిన డిజైన్లు క్షణాల్లో తయారు చేసుకుంటున్నారు. పండగొచ్చినా పబ్బమొచ్చినా నూతన వస్త్రాలు ధరించడం ఆనవాయితీ. దుస్తులు కొనుగోలు చేయడం ఒకెత్తయితే వాటిని శరీరాకృతికి తగినట్టుగా కుట్టించుకోవడం మరో ఎత్తు. దాని కోసం దర్జీల బాట పడుతుంటాం. అందరికీ హుందాతనాన్ని అందించి, జీవనోపాధి పొందుతూ ఇప్పటికీ దర్జాగానే ఉన్నారు. గ్రామాల్లో అన్ని చోట్ల కనిపిస్తారు.

ప్రభుత్వం చేయూతతో..

ఫ్యాషన్ రంగం విస్తరించింది. ప్రస్తుతం అన్ని వయసుల వారికి రెడీ మేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో పట్టణాలకే పరిమితమైన రడీమేడ్ ఇప్పుడు గ్రామాలకు సైతం మళ్లింది. చిన్నపిల్లల వస్త్రాల నుంచి సూట్‌ల వరకూ అందంగా తయారు చేసే దర్జీలు కాలనుగుణంగా మారుతున్నారు. ఒకప్పుడు ఒక డ్రెస్ కుట్టాలంటే 5 రోజులు పట్టేది. దర్జీతో పాటు పలువురు ఉపాధి పొందేవారు. ఇప్పుడు మెషీన్లతో గంటల వ్యవధిలో డ్రెస్ తయారవుతోంది. దీంతో జీవనోపాధి కోల్పోయిన దర్జీలకు ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం ద్వారా చేయూతనివ్వడంతో పూర్వ వైభవం కనిపిస్తోంది. జిల్లాలో సుమారు 55 వేల మంది కుట్టు మిషన్ ద్వారా బట్టలు కుట్టి జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో సగానికి పైగా మహిళలు కుటీర పరిశ్రమగా ఇళ్ల వద్దే మెషీన్లు కుట్టుకుంటు జీవనోపాధి పొందుతున్నారు.


మెషీన్‌కు మరమ్మతులు చేస్తున్న పిఠాపురానికి చెందిన వెంకటేశ్వరరావు

కుట్టు మెషీన్ ఆవిర్భావం ఇలా

170 ఏళ్ల క్రితం సూది దారం ఉపయోగించి బట్టలు కుట్టుకునే వారు. జర్మనీకి చెందిన విలియమ్స్ హూవ్ తన భార్య దుస్తులు కుట్టుకునేందుకు పడుతున్న అవస్థలు గమనించాడు. 1846లో తన దేశంలో 11 నెలలు ఎంతో కష్టపడి ఫిబ్రవరి 28న కుట్టు మెషీన్ కనిపెట్టాడు. అప్పటి నుంచి కుట్టు మెషీన్లు వాడుకలోకి వచ్చాయి. అందువల్లే ఫిబ్రవరి 28ని దర్జీల దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

మహిళలకు స్వయం ఉపాధి

సామాన్య కుటుంబాలకు చెందిన ఎందరో మహిళలు ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేందుకు స్వయం ఉపాధిగా టైలరింగ్‌ను ఎంచుకుంటున్నారు. ఇంటి పనులు చక్కబెడుతూనే ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు టైలరింగ్ మహిళలకు మంచి అవకాశంగా మారింది. టైలరింగ్‌ను చాలా మంది మహిళలు స్వయం ఉపాధిగా మార్చుకుని తమ కాళ్లపై తాము నిలబడుతున్నారు. దీనికి ప్రభుత్వం అందించిన తోడ్పాటు మరింత మందిని ఈ రంగం వైపు మరిలేలా చేస్తోంది.

రెడీమేడ్ వచ్చినా కుట్టేది టైలర్లే..



నేను చిన్నప్పటి నుంచి కుట్టు పని ద్వారానే ఉపాధి పొందుతున్నా. ఇప్పటికీ అదే పని చేస్తున్నా. ఏ రంగంలోనైనా అనేక మార్పులు వస్తున్నాయి. టైలరింగ్‌లో కూడా మార్పులు వచ్చాయి. రడీమేడ్ దుస్తులు అందరినీ ఆకర్షించాయి. అయినప్పటికీ మాకు పని తగ్గలేదు. చాలా మంది తమ బట్టలు తమ శరీరాకృతికి తగ్గట్టుగా టైలర్ దగ్గర కుట్టించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇన్నేళ్లకు ప్రస్తుత ప్రభుత్వం టైలర్లకు ఆర్థిక ఇబ్బందులు ఉంటాయని గుర్తించింది. వారికి జగనన్న చేదోడు పథకం ద్వారా ఆర్థిక సాయం అందించింది.

– టి.ఎస్ఎస్ మూర్తి (చిట్టిబాబు), జిల్లా టైలర్‌ల సంఘం అధ్యక్షుడు, కాకినాడ

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. ఫాల్గుణమాసం, స్వామివారికి ప్రీతైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

అపర్ణాదేవీ.. నమామ్యహం


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం కుంకుమ పూజలు కన్నుల పండువగా జరిగాయి. సుమారు మూడు వేల మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రీల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజలకు వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తాం

సామర్లకోట: మండల పరిధిలోని ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించడానికి యూనియన్‌కు అండగా ఉంటానని ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడు దర్శిపాటి సత్యానందం (సతీష్) అన్నారు. సోమవారం మండల ఎండీయూ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా తేజనాయక్, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ, కోశాధికారిగా వీరవెంకటరమణ ఎన్నికయ్యారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కందరాడ విద్యార్థి


దుర్గాప్రసాద్

పిఠాపురం: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పిఠాపురం మండలం కందరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి మడగం దుర్గాప్రసాద్ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు తెలిపారు. అండర్-14 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దుర్గాప్రసాద్ సోమవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ చిత్తురు జిల్లా నగరిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నాడని ఆయన తెలిపారు. విద్యార్థిని, తనకు తర్ఫీదు ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.సుబ్బారావును గ్రామపెద్దలు అభినందించారు.

గృహ నిర్మాణ రుణ చెక్కుల అందజేత

సామర్లకోట: మండల పరిధిలో పవర గ్రామంలోని జగనన్న కాలనీని ఎంపీడీఓ డి.శ్రీలలిత సోమవారం పరిశీలించారు. పవర హౌసింగ్ లేఅవుట్‌లో 68 మంది ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉండటంతో ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను ఆదేశించారు. వెలుగు డిపార్టుమెంట్ అధికారుల ద్వారా మహిళా సంఘాల్లో ఉన్న 40 మందికి రుణాలు మంజూరు చేయించి ఈ సందర్భంగా ఆ చెక్కులను అందజేశారు. సోమవారం నుంచి పనులు వేగంగా చేసుకొంటామని లబ్ధిదారులు ఎంపీడీఓకు తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు పాల్గొన్నారు.

స్పందనకు తొమ్మిది అర్జీలు


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి సోమవారం డివిజన్‌లో ఆయా మండలాల నుంచి తొమ్మిది అర్జీలు అందాయి. పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డిటీ భానుకుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ చైర్మన్లకు సత్కారం


బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులను సత్కరించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ చైర్మన్లు సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చింతల రాజాలను దవులూరి దొరబాబు సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్రమ కుళాయిలపై ఆగ్రహం

- ఆదాయానికి గండికొట్టడం సరికాదంటూ మండిపాటు
- కాలుష్యం, పందులు, కుక్కల సంచారంపై సభ్యుల ఆగ్రహం
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పట్టణంలో అనధికార కుళాయి కనెక్షన్లతో అసలైన లబ్ధిదారులకు మేలు జరగడం లేదంటూ పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ మండిపడింది. పురపాలక సంఘ సర్వ సభ్య సాధారణ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో అనధికార, అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలు ఎందుకు తీసుకోలేదంటూ ప్రశ్నించారు. గత కౌన్సిల్‌లో సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగా మున్సిపాలిటీ ఆదాయ వనరులకు గండి కొట్టారన్నారు. ఇప్పటికైనా అక్రమ కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి. ఎంత మంది సిబ్బంది చేతివాటం ఉందో తెలపాలంటూ అధికారులను నిలదీశారు. దీనిపై వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ కలుగజేసుకుని గత ప్రభుత్వ, కౌన్సిల్ హయాంలో జరిగిన అనధికార, అక్రమ కుళాయి కనెక్షన్లపై అప్పుడు కౌన్సిలర్‌గా ఉన్న మీరు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. అప్పటి అంశాలపై ఇప్పుడు బురదజల్లడం సరికాదన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై కమిషనర్ జంపా సురేంద్ర వివరణ ఇస్తూ సుమారు 800కు పైగా అనధికార కుళాయి కనెక్షన్లు గుర్తించామన్నారు. చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ సాయి ప్రసాద్‌లు మాట్లాడుతూ సత్వరమే వాటిపై విచారణ చేపట్టి మున్సిపల్ ఆదాయానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో మెయిన్‌రోడ్డులోని షాపింగ్ కాంపెక్లెస్ నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని కోరగా వీసీ సాయి ప్రసాద్ కలుగజేసుకుని దీనిపై శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టామని, త్వరలోనే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ, ఆరెళ్ళ వీర్రాఘవ మాట్లాడుతూ పందుల, కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. జీఓ నెంబర్ 405 ప్రకారం నిరుపేదల ఇంటి పన్ను తగ్గించాలన్నారు. చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో సుమారు రూ.ఏడు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. రోడ్లు, డ్రెయిన్‌లు, కల్వర్టులతో పాటు మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టామన్నారు. గత టీడీపీ హయాంలో ఎక్కడ పనులు అక్కడే వదిలేస్తే ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో త్వరితగతిన అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని రూ.148 కోట్లతో మూడు దఫాల్లో పైపులైన్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ అన్నారు. టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ చంద్రశేఖర్, మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ పాల్గొన్నారు.


సభ్యులకు సమాధానమిస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్


కుళాయి కనెక్షన్లపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు రాజశేఖర్, సత్యభాస్కర్

తాగునీటి ఎద్దడిపై యుద్ధం

- వాయిదా పడ్డ సామర్లకోట కౌన్సిల్ సమావేశం
- అధికార పక్ష సభ్యులే నిలదీసిన వేళ

సామర్లకోట: అధికార పక్ష సభ్యులే ప్రతిపక్ష సభ్యులుగా వ్యవహరించి కౌన్సిల్ సమావేశం వాయిదా పడే విధంగా చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. పట్టణంలో తాగునీటి సమస్యపై చర్చించడానికి జీరో అవర్ కావాలని అధికార పక్ష సభ్యులు పట్టుబట్టడంతో మొదట మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. గత కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు ఎంతవరకు పరిష్కరించారో చెప్పాలని అధికార పక్ష సభ్యులు పిట్టా సత్యనారాయణ, పి.కృష్ణ, పాగా సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. దాంతో గ్యాస్ పైపులైన్ కంపెనీ నుంచి రూ.79 లక్షలు రావలసి ఉన్నదని, రైల్వేకు సరఫరా చేస్తున్న తాగునీటిపై రూ.30లక్షలకు డిమాండ్ నోటీసులు ఇస్తున్నామని, ఓపెన్ జిమ్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని డీఈ హుస్సేన్ సభ్యులకు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలో పనిచేయని ఆర్వో ప్లాంట్లపై ఏ నిర్ణయం తీసుకున్నారని వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, కరణం రాజ్‌కుమార్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్ ప్రశ్నించారు. వార్డులో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నదని రెడ్నం సునీత చైర్‌పర్సన్ దృష్టికి తేవడంతో అధికార పక్ష సభ్యులు అందరూ ఒకేసారి తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే వరకు కౌన్సిల్ సమావేశానికి వచ్చేది లేదని, వార్డులో ప్రజలు తమను తిరగనీయడం లేదని అన్నారు. ఒకదశలో సభ్యులు అందరూ చైర్‌పర్సన్ పోడియంను ముట్టడించారు. టిడ్కో లబ్ధిదారులకు తాళాలు ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నా వారి సమస్యలు పట్టించుకోవడం లేదని పాగా సురేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఏ సమస్యనూ పట్టించుకోవడం లేదని నేతల హరిబాబు, గుబ్బల సత్యనారాయణ, పిట్టా సత్యనారాయణ, చిట్టుమాని రాఘవ, కానేటి రాజేశ్వరీ, ప్రతిపక్ష సభ్యుడు బలుసు వాసు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు అందరూ తాగునీటి సమస్యపై అసంతృప్తిగా ఉండటం వలన కౌన్సిల్ సమావేశం వాయిదా వేసి తాగునీటిపై సమస్యను పరిష్కరించాలని వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ సూచించారు. దాంతో కౌన్సిల్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు.


అధికారుల తీరుకు నిరసనగా చైర్‌పర్సన్ పోడియంను ముట్టడించిన సభ్యులు

గ్రామ సింహాల నుంచి రక్షించండి

- అధికారులను కోరిన కౌన్సిలర్లు
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం: గొల్లప్రోలు నగరపంచాయతీ పరిధిలో గ్రామ సింహాలు (కుక్కలు) విపరీతంగా పెరిగిపోయి పశువులపై దాడి చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని నిలువరించే ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ మొగలి దొరబాబు అధికారులను కోరారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. సందర్భంగా కౌన్సిలర్లు జ్ఞానేశ్వరి, గొల్ల సుబ్బారావు, పొన్నం మహాలక్ష్మి మాట్లాడుతూ 16, 12, 20వ వార్డుల్లో అభివృద్ధి పనులు జరగడం లేదని వాటిని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ సత్యనారాయణ సమాధానమిస్తు వార్డు సచివాలయ నిధులు వార్డులకు సరిపడా కేటాయించామని ఈ పనులన్నీ టెక్నికల్ శాంక్షన్ టెండర్ల దశలో ఉన్నాయని త్వరలోనే పనులు మొదలు పెడతామని తెలిపారు. నగర పంచాయతీలో పెరిగిపోయిన కుక్కలను ఇతర ప్రాంతాలకు తరలించడానికి సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం పశుసంవర్ధక శాఖ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడో వార్డు కౌన్సిలర్ మైనం భవానీరాజా మాట్లాడుతూ ఏలేరు కాలువ నుంచి గోదావరి నీరు తేవడానికి పైపు లైన్ వేస్తున్నారని ఇప్పటికే కొన్ని పైపులు కప్పెట్టారని మిగిలిన పనులు జరగడం లేదని ఇప్పటికే వేసవి వచ్చి ఎండలు మండుతుండగా తాగునీరు అందక పోతే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనిపై అధికారులు సమాధానమిస్తూ పనులు వేగవంతం చేశామని వేసవికి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరి సహకారం ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు సభ్యులకు విజ్ఞప్తి చేసారు. అన్ని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

పిఠాపురం: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలని గొల్లప్రోలు మండలం దుర్గాడలో సోమవారం ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సాధికారత సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫామింగ్ విధానాలను ప్రతి రైతు దరి చేర్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టి పెట్టుబడి తగ్గించుకోవాలని, లాభసాటి పంటలు పొందాలని సూచించారు. రబీ పూర్తయిన తరువాత భూమిని ఖాళీగా ఉంచకుండా నవ ధాన్యాలు సాగు చేయాలని, దీని ద్వారా భూమిని సారవంతమవుతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది కె.శ్రీను, ఒ.శ్రీను, ఎం.మణికంత, నరేష్, మాణిక్యాలరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


దుర్గాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది విద్యార్థులు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తాం


ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కొప్పన శివనాథ్


ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వర్ధినీడి సుజాత

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని వైఎస్సార్ సీపీ యువజన, మహిళా విభాగాల అధ్యక్షులుగా నియమితులైన కొప్పన శివనాథ్, వర్ధినీడి సుజాతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతలను అప్పగించడానికి పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబును సోమవారం కొవ్వూరులో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో కీలకమైన యువజన, మహిళా విభాగాలకు తమ పేర్లను సూచించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమ శక్తి వంచన లేకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

కొత్తపల్లిలో...

కొత్తపల్లి: విశ్వనాథ్, సుజాతలను పిఠాపురంలోని వారి స్వగృహాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు కలుసుకొని అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, గౌరిసే కాపురెడ్డి, గింజల శ్రీనివాస్, దాకే రాజ్‌కుమార్, బర్రె రవి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


సూరాడ నాగేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఉప్పాడ పంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సూరాడపేటకు చెందిన సూరాడ నాగేష్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం, కొత్తపట్నానికి చెందిన మైల మహేంద్ర మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మిడి జాన్, మేరుగు ఎల్లాజీ, చొక్కా సింగన్న బొందు రాంబాబు, గోగు బుజ్జీ తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవాలు

కొత్తపల్లి: కొండెవరంలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి 60వ కల్యాణ మహోత్సవాలను మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు 6వ తేదీ వరకూ జరగనున్నాయి.

మంచి కెరీర్‌తోనే జీవితంలో గుర్తింపు


సమావేశంలో మహోన్నత్‌ను సత్కరించిన ఉపాధ్యాయులు

సామర్లకోట: మంచి కెరీర్‌తోనే జీవితంలో గుర్తింపు వస్తుందని వైద్యులు మహోన్నత్ అన్నారు. కెరీర్ గైడెన్సు డే సందర్భంగా స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ అతిథిగా పాల్గొన్నారు. కెరీర్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, స్పందన ఈదా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ మూర్తి, సభ్యులు టీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరు మహోన్నత్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కెరీర్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కెరీర్ డే ఆకారంలో కూర్చుని కెరీర్ డే ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ కె.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు కె.నూకరాజు, విద్యా కమిటీ చైర్మన్ వి.రాంబాబు, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

గండేపల్లి: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నీలాద్రిరావుపేట శివారులో రహదారిని ఆనుకొని ఉన్న ఒక దాబాలో పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. 52 పేక ముక్కలు, రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై తెలిపారు. సింగరంపాలెం శివారులో సారా తయారు చేస్తున్న వారిపై దాడి చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై తెలిపారు. వీరిని పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

భారీ అన్న సమారాధన

కొత్తపల్లి: నాగులపల్లిలోని మాణిక్యాంబ సమేత ఉమామహేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 4 వేలు మంది భక్తులు విచ్చేసి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పెద్దాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద సోమవారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, ఊబా జాన్‌మోజెస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణలతో కలిసి ప్రారంభించారు. తాటికొండ పెద్దకాపు, వెంకటలక్ష్మి, వెంకటాచలం, స్వామి తదితరులు పర్యవేక్షించారు.